క్లుప్తంగా

జగ్గిరెడ్డిని కలసిన చిన్నరాజా



చిన్నరాజాను శాలువాతో సత్కరిస్తున్న జగ్గిరెడ్డి

మలికిపురం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిని రాజోలు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్న రాజా ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నూతన బాధ్యతలు స్వీకరించిన చిన్నరాజా ఈ మేరకు జగ్గిరెడ్డిని కలసి శాలువా కప్పి ధన్యవాదాలు తెలిపారు. అలాగే జగ్గిరెడ్డి కూడా శాలువాతో చిన్నరాజాను సత్కరించారు. జగన్ ఆశయాలకు అనుగుణంగా పార్టీ కోసం పని చేయాలని జగ్గిరెడ్డి సూచించారన్నారు.

జగ్గిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన విద్యాసాగర్



జగ్గిరెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలిపిన కుడుపూడి విద్యాసాగర్ తదితరులు

అయినవిల్లి: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిని ఆయన స్వగృహంలో కుడుపూడి విద్యాసాగర్(జిజ్జి) కలసి తనకు జిల్లా ఉపాధ్యక్ష పదవి ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పూర్వవైభవానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

స్వామివారి సన్నిధిలో ఎమ్మెల్సీ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పశ్చిమగోదావరి జిల్లా ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు ఆయనకు లడ్డూప్రసాదం అందజేశారు. స్వామివారి చిత్రపటాన్ని ఎంపీపీ వీరా మల్లిబాబు ఆయనకు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆషాఢ శుద్ధ శయన ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నవ జనార్దన ఆలయాల్లో ప్రఖ్యాతిగాంచిన నారద మహర్షి ప్రతిష్ఠించబడిన ఆలమూరులో వేంచేసిన శ్రీ, భూ సమేత జనార్దన స్వామి ఆలయాన్ని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంగారు ఆభరణాలు, పూలమాలలతో స్వామివారిని అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ఆవరణలో దేవదాయశాఖ పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది.

ఘనంగా జునోసిస్ డే



గుడిమెళ్లంకలో కుక్కకు టీకా వేస్తున్న వైద్యులతో ఎంపీపీ సత్యవాణి

ఆలమూరు: స్థానిక పశుసంవర్ధక శాఖ సబ్ డివిజన్ సహాయకురాలు ఎల్.అనిత ఆధ్వర్యంలో ప్రపంచ జంతు వ్యాధి నివారణ (జునోసిస్) డే దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. మండలంలోని వివిధ పశువుల ఆస్పత్రుల్లో జంతు సంబంధిత వ్యాధులు–నివారణ అనే అంశంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించాలని సూచించారు. స్థానిక ఏడీఏ కార్యాలయం ఆవరణలోని పశువుల ఆస్పత్రిలో పెంపుడు కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలను ఏడీఏ లలిత అందజేశారు. వైద్యాధికారులు జి.భానుప్రసాద్, సుభాష్‌చంద్ర, ఈదల శ్రీనివాసు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మలికిపురం: జునోసిస్ డే సందర్భంగా మలికిపురంతో పాటు ఆయా వైద్య కేంద్రాల వద్ద ఆదివారం జునోసిస్ డేను నిర్వహించారు. కుక్కలకు టీకాలు వేశారు. ఆయా శిబిరాల వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడారు. పెంపుడు కుక్కలకు రెండో నెలలో మొదటిసారి, మూడవ నెలలో రెండోసారి తదుపరి ప్రతి ఆరునెలలకోసారి తప్పనిసరిగా యాంటీ రేబిస్ టీకాలు వేయించుకోవాలని సూచించారు. సరైన యాజమాన్య పద్ధతులు, నట్టల నివారణ మందులు మూడు నెలలకోసారి వేయించుకోవాలని, కుక్క కాటు వేస్తే తీసుకోవలసిన జాగ్రత్తల గురించి డాక్టర్లు సూచించారు. ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, స్థానిక సర్పంచ్ నల్లి విజయకుమారి శిబిరాన్ని ప్రారంభించారు. సుమారుగా 200 కుక్కలకు టీకాలు వేశారు.

ముగిసిన మొహర్రం సంతాప దినాలు

కొత్తపేట: ప్రవక్త మనవలు హసన్, హుస్సేన్ త్యాగాలను స్మరించుకుంటూ ముస్లింలు మొహర్రం సంతాప దినాలు ఆదివారంతో ముగిశాయి. 10 రోజుల పాటు ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. దానిలో భాగంగా కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం మసీదులో మసీదు, షాదీఖానా కమిటీ ప్రెసిడెంట్ షేక్ కాజాబాబు ఆధ్వర్యంలో మొహర్రం ప్రాముఖ్యతను, ప్రవక్త మనవల ప్రాణత్యాగాల గురించి వివరించారు. వారి పవిత్ర ఆత్మశాంతికి ప్రార్థనలు జరిపారు. అనంతరం అందరూ కలసి ఆహారం స్వీకరించారు.

కార్పొరేట్‌కు దీటుగా.. ఉజ్వల భవిత దిశగా..

- కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల
- ఎనిమిది కోర్సులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు
- డిజిటల్ క్లాస్ రూమ్స్, ల్యాబొరేటరీలు, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్



కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

కొత్తపేట: విద్యార్థుల భవిష్యత్తుకు భరోసానిస్తూ, ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా కొత్తపేట విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉత్తమ ఫలితాలు, ఉన్నత ప్రమాణాలతో ముందుకు వెళుతోంది. నియోజకవర్గ, డివిజన్ కేంద్రమైన కొత్తపేటలో 1979లో ఈ కళాశాలను స్థాపించారు. గత 46 ఏళ్లుగా కొత్తపేట, పరిసర ప్రాంతాల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుంది. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా కళాశాలలో కోర్సులు, సౌకర్యాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు తదితర అంశాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు వివరించారు. గత సంవత్సరం వరకు కళాశాలలో 8 సబ్జెక్టుల్లో సింగిల్ మేజర్ ప్రోగ్రామ్స్ అందుబాటులో ఉండగా ప్రభుత్వం 2025–26 విద్యా సంవత్సరం నుంచి డబుల్ మేజర్ విధానాన్ని అమలు చేయాలని యోచిస్తోంది. ఈ విధానంలో 8 డబుల్ మేజర్ ప్రోగ్రామ్స్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. భవిష్యత్‌లో మరిన్ని కొత్త కోర్సులు ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

కెరీర్ గైడెన్స్ సెల్, పీజీ ఎంట్రన్స్ కోచింగ్

పోటీ ప్రపంచాన్ని దృష్టిలో ఉంచుకుని ఆసక్తి ఉన్న విద్యార్థులకు ప్రతిరోజూ సాయంత్రం కాంపిటేటివ్ కోచింగ్ క్లాసులు నిర్వహిస్తున్నారు. డిగ్రీ అనంతరం యూనివర్సిటీల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేయబోయే విద్యార్థులకు వివిధ సబ్జెక్టుల్లో పీజీ ఎంట్రన్స్ కోచింగ్ ఇస్తున్నారు.

కళాశాలలో కోర్సులు

బీఏ ఎకనామిక్స్, బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ మేథమేటిక్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ జువాలజీ కోర్సులు ఉన్నాయి.

లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఎల్ఎంఎస్) వీడియోలతో..

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు తయారు చేసిన వీడియోలను లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఎల్ఎంఎస్)లో భాగంగా ప్రతి వారం విద్యార్థులకు వారి సెల్ ఫోన్లలో వీడియో లెసన్స్ చూపిస్తారు. వీటిని యూట్యూబ్‌లో కూడా అందుబాటులో ఉంచుతారు. విద్యార్థులకు నెల రోజుల వ్యవధితో సర్టిఫికెట్ కోర్సులనూ ప్రతి సెమిస్టర్‌లో నిర్వహిస్తారు. స్పోకెన్ ఇంగ్లిష్, డేటా ఎంట్రీ, జీఎస్టీ, టూరిజం, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ వంటి అంశాలపై ఆయా కోర్సులను నిర్వహిస్తున్నారు. యోగా, మెడిటేషన్ క్లాసులు కూడా నిర్వహిస్తారు.

అందుబాటులో జేకేసీ, డిజిటల్ క్లాసులు

కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా వివిధ ఆన్‌లైన్ కోర్సులను ఉచితంగా నిర్వహిస్తున్నారు. వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నిర్వహించే ఉచిత కోర్సుల్లో విద్యార్థులను రిజిస్టర్ చేసి, వారితో ఈ కోర్సులను పూర్తి చేయించి, ఆన్లైన్ ద్వారా సర్టిఫికెట్లు అందిస్తున్నారు. జేకేసీ ల్యాబ్‌లోని కంప్యూటర్ల ద్వారా విద్యార్థులందరూ వారికి అవసరమైన కంప్యూటర్ వర్క్స్ చేసుకోవడానికి వీలు కల్పిస్తున్నారు. విద్యార్థులకు సాధారణ క్లాసులతో పాటు, 60:40 నిష్పత్తిలో డిజిటల్ క్లాసులు కూడా నిర్వహిస్తున్నారు.

లైబ్రరీ అండ్ రీడింగ్ రూం

సుమారు 16 వేల పుస్తకాలతో విశాలమైన లైబ్రరీ, రీడింగ్ రూమ్ విద్యార్థులు, అధ్యాపకులకు అందుబాటులో ఉంది. ఎంతగానో ఉపయోగపడుతుంది. వీటితో పాటు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. సురక్షిత మంచినీటి కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. పండగలు, ప్రత్యేక దినాల్లో ఏటా అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి, విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు. నూతన విద్యా విధానం 2020కి అనుగుణంగా ప్రతి విద్యార్థి సంవత్సరం చివరలో ఇంటర్న్‌షిప్ చేసి శిక్షణ పొందాల్సి ఉంటుంది. తదనంతరం మూడేళ్ల తర్వాత ఏదైనా కంపెనీలో ట్రైనింగ్, ప్రాజెక్ట్ చేసిన నివేదిక సమర్పించాలి. ఈ అన్ని రకాల ఇంటర్న్‌షిప్ శిక్షణలను అధ్యాపకులు రోజూ పర్యవేక్షిస్తారు. విద్యార్థులకు ప్రతి వారం ఒక అంశంపై క్లాస్ రూమ్ సెమినార్, డిబేటు, గ్రూపు డిస్కషన్స్ వంటివి నిర్వహిస్తున్నారు. తద్వారా వారిలో ఉన్న నైపుణ్యాన్ని పెంపొందిస్తారు.

విద్యార్థుల ఉన్నత భవిష్యత్తే లక్ష్యంగా..



ప్రతి విద్యార్థీ ఉత్తమ ఫలితాలతో ఉన్నత భవిష్యత్తు సాధించాలనే లక్ష్యంతో కళాశాలను ముందుకు తీసుకువెళుతున్నాం. ప్రభుత్వం, యూనివర్సిటీ నుంచి అన్ని అవకాశాలను విద్యార్థుల విద్యాబోధనకు సద్వినియోగపరచుకుంటున్నాం. మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాం. అధిక సంఖ్యలో విద్యార్థులు చేరి, అన్ని సౌకర్యాలతో కూడిన విద్యాబోధన, ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి.

– కె.పెద్దిరాజు, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్, కొత్తపేట

మాజీ సీఎం జగన్‌ను కలసిన సురేష్



వైఎస్సార్ సీపీ సోషల్ యాక్టివిటీ వింగ్ కార్యదర్శిగా రాజోలు నియోజకవర్గ మలికిపురం మండలం గూడపల్లి గ్రామానికి చెందిన మోకా సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు సురేష్ తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌ను మర్యాద పూర్వకంగా కలసి ధన్యవాదాలు తెలిపారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడి మృతి



గంగయ్యనాయుడు (ఫైల్)

మామిడికుదురు: పెదపట్నంలంక సొసైటీ మాజీ అధ్యక్షుడు పినిశెట్టి గంగయ్యనాయుడు (92) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఆయన గత కొంత కాలం నుంచి ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన అంత్యక్రియలు సోమవారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. గంగయ్యనాయుడు మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు.

నేటి కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు

- ఉయ్యూరువారి మెరకలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ
- రాజోలు నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం
- ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జ్ గొల్లపల్లి



ఉయ్యూరువారి మెరక కమ్యూనిటీ హాలులో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న గొల్లపల్లి

సఖినేటిపల్లి: రాజోలు నియోజకవర్గం పరిధిలోని సఖినేటిపల్లి మండలం ఉయ్యూరువారి మెరక కమ్యూనిటీ హాల్‌లో సోమవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమానికి పార్టీ కేడర్ ఆదివారం విస్తృత ఏర్పాట్లు చేస్తుంది. ముఖ్య అతిథులుగా జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో పార్టీ విస్తృత సమావేశానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఏర్పాట్లను సమీక్షించారు. కమ్యూనిటీ హాల్‌లో వేదిక ప్రముఖులు, ముఖ్య అతిథులు ఆశీనులకు తగిన ఏర్పాట్లు గురించి కార్యకర్తలకు ఆయన సూచనలు చేశారు. అలాగే ముఖ్య అతిథులకు స్వాగత ఏర్పాట్లపై పలు సూచనలు, సలహాలు చేశారు. గొల్లపల్లి మాట్లాడుతూ, నియోజకవర్గ స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని పార్టీ కేడర్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో శ్రేణులు తరలి రావాలని సూచించారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏ మాత్రం అమలు చేయకుండా ప్రజలను వంచన చేసిందని, బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ సభ ద్వారా కూటమి ప్రభుత్వ నిర్వాకాన్ని ఎండగడదామని గొల్లపల్లి, శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, గ్రామశాఖ అధ్యక్షుడు కారుపర్తి భాస్కరరావు, చేనేత విభాగం ప్రతినిధి జాన శంకరరావు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈద రవిరెడ్డి, రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధి తాడి సహదేవ్, మండపేట నియోజకవర్గ పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్య, నాయకులు చింతా సుధాకరరావు, నల్లి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి తీవ్ర గాయాలు

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం శివారు హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతికి తీవ్ర గాయలయ్యాయి. అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కొర్లపాటివారిపాలేనికి చెందిన మిండగుదిటి పవిత్ర ధనలక్ష్మి, ఆమె సోదరి మిండగుదిటి సాయిచంద్రలేఖ, సోదరుడు మిండగుదిటి సిద్ధి వినయ్ ఈ నెల 5న బైక్‌పై అమలాపురం వెళుతున్నారు. ఈ సమయంలో పేర్యాయిపాలెం రోడ్డు నుంచి మోటారు సైకిలిస్టు అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ఆ ముగ్గురు వెళ్లే బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. దాంతో పవిత్ర ధనలక్ష్మికి తీవ్ర గాయాలు కాగా, సాయిచంద్రలేఖ, సిద్ధి వినయ్‌లకు గాయాలయ్యాయి. తీవ్రగాయాలతో ఉన్న పవిత్ర ధనలక్ష్మిని అమలాపురం కిమ్స్‌కు తరలించగా మెరుగైన చికిత్స కోసం కాకినాడ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు సిద్ధివినయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసు మృతుల కుటుంబాలకు విరాళం

ఆలమూరు: విధి నిర్వహణలో కారులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ మృతి చెందిన ఆలమూరు ఎస్సై ఎం.అశోక్, కానిస్టేబుల్ ఎస్.బ్లెస్సన్ కుటుంబాలకు రూ.31 లక్షల ఆర్థికసాయం వితరణ జరిగింది. 2009లో అప్పటి ఉమ్మడి (ఆంధ్రా, తెలంగాణ) రాష్ట్రంలో ఎస్సైలుగా నియమితులైన సుమారు 1100 మంది ఈ విరాళాన్ని సమకూర్చుకున్నారు. అందులో భాగంగా ఎస్సై అశోక్ నివాసమైన పశ్చిమగోదావరి జిల్లాలోని నరసాపురం వెళ్లి కుటుంబసభ్యులకు రూ.26 లక్షల చెక్కు అందజేశారు. అనంతరం ఎస్సై అశోక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే ఆలమూరులోని కానిస్టేబుల్ బ్లెస్సన్ నివాసానికి వచ్చి అతని కుటుంబసభ్యులకు రూ.ఐదు లక్షల చెక్కు అందజేశారు. అనంతరం కానిస్టేబుల్ బ్లెస్సన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కర్తవ్య నిర్వహణలో మృతి చెందిన తమ సహచర ఉద్యోగులైన ఎస్సై అశోక్, కానిస్టేబుల్ బ్లెస్సన్ రుణం ఎన్నటికీ తీర్చుకోలేదని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ వ్యాఖ్యానించారు. మృతుల కుటుంబాలకు తమ వంతు సాయంగా ఈ విరాళాన్ని అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇద్దరికి ఆర్థిక సాయం

మలికిపురం: మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు సమకూర్చిన ఆర్థిక సాయాలను దివారం అందించారు. మలికిపురంలోని వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు చేతుల మీదుగా చెక్‌లను బాధితులకు అందించారు. రాచపల్లి దుర్గాప్రసాద్ (మోరిపోడు)కు రూ.10 వేలు, బోసుకొండ పాండురంగారావు (అడవిపాలెం)కు రూ.10 వేలు అందించారు.

పలువురు వైఎస్సార్ సీపీ నాయకులకు పదవులు



తాడి సహదేవ్



ఈద రవిరెడ్డి



గుత్తుల వాసు



బండారు దొరబాబు



గొలకోటి సూర్యప్రకాష్



షేక్ వలీబాబా

సఖినేటిపల్లి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధిగా ఉయ్యూరువారి మెరక గ్రామానికి చెందిన తాడి సహదేవ్, అలాగే పార్టీ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అంతర్వేదిపాలేనికి చెందిన ఈద రవిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. వారు మాట్లాడుతూ, తమ పదవుల కోసం సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డికి, మాజీ మంత్రి, రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో సముచిత స్థానం

కొత్తపేట: వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో కొత్తపేటకు సముచిత స్థానం లభించింది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సారథ్యంలో జిల్లాలోని 7 నియోజకవర్గాల నుంచి పార్టీ కోసం సైనికుల్లా పనిచేసే నాయకులను గుర్తించి వివిధ పదవుల్లో నియమించారు. కొత్తపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో అన్ని సామాజిక వర్గాల నుంచి 10 మందికి స్థానం కల్పించారు. వారిలో కొత్తపేట మండలం నుంచి ఉపాధ్యక్షుడిగా గుత్తల వాసు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బండారు దొరబాబు, సెక్రటరీ యాక్టివిటీలుగా గొలకోటి సూర్యప్రకాష్, షేక్ వలీబాబా నియమితులయ్యారు. వారిని జిల్లాలో పలువురు నాయకులు అభినందిస్తూ సత్కరించారు. నూతన కమిటీలో స్థానం పొందిన నాయకులు మాట్లాడుతూ జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఎంతో నమ్మకంతో తమను గుర్తించి ఆయా పదవుల్లో నియమించారని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభ్యున్నతికి పాటుపడతామని అన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు పాటుపడాలి



అంబాజీపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



మెర్లపాలెంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

అంబాజీపేట: దేశ మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు నేటితరం పాటుపడాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, నాయకులు పీకే రావు అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా అంబాజీపేట బస్టాండ్ వద్ద, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉందుర్తి నాగబాబు ఆధ్యక్షతన ఆదివారం జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కె.పెదపూడిలోను డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కొర్లపాటి కోటబాబు, మట్టపర్తి హరి, చింతపల్లి వెంకటేశ్వరరావు, మట్టపర్తి బాలాజీ, గోసంగి సత్యనారాయణ పాల్గొన్నారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: మాజీ ఉప ప్రధాని జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా మామిడికుదురు సెంటర్‌లో విగ్రహానికి దళిత సంఘాల నేతలు ఆదివారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. దళితుల హక్కుల కోసం జగ్జీవన్ రామ్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జాలెం శ్రీనివాసరాజు, నూటుకుర్తి సత్యనారాయణ, మంద గాంధీ, చుట్టుగుళ్ల కిశోర్, చేట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కృషీవలుడు జగ్జీవన్‌రామ్

కొత్తపేట: దేశంలో సామాజిక న్యాయ సాధనకు భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ గొప్ప కృషి చేశారని మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆత్రేయపురం మండలం మెర్లపాలెంలో ఆయన విగ్రహానికి జగ్గిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పణ



నగరంలో దొడ్డి గంగాలమ్మకు ఆషాఢం సారె తీసుకువెళ్తున్న మహిళలు



నేదునూరులో ముత్యాలమ్మకు ఊరేగింపుగా సారె తీసుకొస్తున్న భక్త బృందం

మామిడికుదురు: ఆషాఢమాసం సందర్భంగా మండలంలోని నగరం గ్రామదేవత దొడ్డి గంగాలమ్మకు ఆదివారం ఆషాఢం సారె సమర్పించారు. మేళతాళాలతో భారీ ఊరేగింపుగా మహిళలు శిరస్సుపై బిందెలతో పసుపునీళ్లు, కుంకుమ, పండ్లు పలు రకాల స్వీట్లు తీసుకుని ఊరేగింపుగా బయలుదేరి వెళ్లారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా సేవా సంయోజిక అప్పారి నాగప్రసాద్, జిల్లా మహిళా కన్వీనర్ యనమదల లక్ష్మి, కటికదల రాంబాబు, భారీ సంఖ్యలో ఎస్ఎస్ఎఫ్ మండల మహిళా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ తల్లికి..

అయినవిల్లి: సమరసత సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నేదునూరు మహిళా భక్తులు గ్రామ దేవతకు ఆషాఢమాసం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం సారె సమర్పించారు. మేళతాళాలు, శక్తి వేషాలు, కోలాటాలతో సుమారు 500 మంది మహిళలు ఊరేగింపుగా పసుపు, కుంకుమ, చీర, రవిక, చలివిడి, పానకం, వివిధ రకాల స్వీట్లు, పండ్లు, తీసుకొని వెళ్లి అమ్మవారికి సామూహికంగా సారె సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు, వివిధ ధార్మిక, సేవా సంస్థల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దాతల సహాయంతో భారీ ఎత్తున ప్రసాద వితరణ చేశారు.

రసాయనాలు వద్దు.. కషాయాలే ముద్దు



ఇరుసుమండలో కషాయం తయారు చేస్తున్న మహిళలు

అంబాజీపేట: పంటలను నాశనం చేస్తున్న పురుగుల నివారణకు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా రసాయనాల వినియోగానికి స్వస్తి చెప్పి కషాయాలను (అగ్నిఅస్త్రం) వినియోగిస్తే ఆరోగ్యానికి మంచిదని ప్రకృతి వ్యవసాయ ఎల్2 దుర్గాలక్ష్మి రైతులకు సూచించారు. ఇరుసుమండలో ప్రకృతి వ్యవసాయం, కషాయాల తయారీపై ఎంటీ జె.నాగమణి అధ్యక్షతన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పురుగుల నివారణకు కషాయాలను వినియోగిస్తే ఖర్చు ఆదా చేయడమే కాకుండా నాణ్యమైన పంట వస్తుందన్నారు. వేప ఆకులతో గోమూత్రం, పచ్చిమిర్చి, పొగాకు వెల్లుల్లితో కషాయాలను తయారు చేసుకోవాలన్నారు. ఎకరానికి ఒక పంట కాలవ్యవధికి 15 లీటర్ల అగ్నిఅస్త్రం సరిపోతుందన్నారు. 15 లీటర్ల గోమూత్రం, 5 కేజీల వేపాకు, కేజీ పచ్చిమిర్చి, కేజీ పొగాకు, అరకేజీ వెల్లుల్లిని వినియోగించుకోవాలన్నారు. వీటన్నింటిని సన్నటి మంటపై బాగా మరిగించాలన్నారు. చల్లారిన తరువాత వడపోసి 48 గంటల పాటు నిల్వ ఉంచాలన్నారు. ఈ అగ్నిఅస్త్రం మూడు నెలలు పాటు నిల్వ ఉంటుందన్నారు. కాండం తొలిచే పురుగుపై బాగా ప్రభావం చూపిస్తుందన్నారు. ఒక ఎకరానికి 100 నీటికి 3 నుంచి 5 లీటర్ల కషాయం కలిపి పిచికారీ చేయాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో సీహెచ్ సత్యశ్యామల లక్ష్మి, ఎం.దుర్గాభవాని, ఎం.సత్యవాణి, డీవీఎస్.మణి, కె.మల్లేశ్వరి, జె.కనకలక్ష్మి పాల్గొన్నారు.

ఈ విధంగా విత్తన శుద్ధి చేయండి

మామిడికుదురు: ఈదరాడ, మాకనాలెం గ్రామంల్లో విత్తనశుద్ధిపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. బీజామృతంతో విత్తనశుద్ధి చేయడంపై రైతులకు సమగ్రంగా వివరించారు. బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం వల్ల భూమి నుంచి, విత్తనం నుంచి వచ్చే తెగుళ్లను అరికట్టవచ్చన్నారు. ఈ విధంగా విత్తనశుద్ధి చేయడం వల్ల మొలక శాతం మెరుగ్గా ఉంటుందని, దిగుబడి శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు యెరుబండి శ్రీనివాసరావు, పెదపూడి వెంకటేశ్వరరావు, నేల ప్రభుదాస్, నేల రమేష్ చేత విత్తనశుద్ధి చేయించారు. ఈదరాడ యూనిట్ ఇన్‌చార్జ్ కుడుపూడి జానకి, ఐసీఆర్‌పీ చెల్లుబోయిన రాధ, గోగి లెనిన్‌రావు ఆధ్వర్యంలో పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి పలువురు దాతల విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రావులపాలెంకు చెందిన కూన సూర్యప్రకాష్ రూ.25,896, అదే గ్రామానికి చెందిన కొవ్వూరి జైత్రి శ్రీ షణ్ముఖ రూ.10,116 విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును దాతలు ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావుకు ఆదివారం అందజేశారు. దాతను ఆలయ ప్రధానార్చకులు, ఆలయ వేదపండితులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

మృతుడి కుటుంబానికి సాయం



పల్లిపాలెంలో ఆదిలక్ష్మిని ఓదారుస్తున్న డీటీఓ శ్రీనివాసరావు

సఖినేటిపల్లి: మండలంలోని పల్లిపాలేనికి చెందిన మృతుడు కామాని దుర్గాప్రసాద్ కుటుంబానికి ఆదివారం జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు మృతుడు తల్లి ఆదిలక్ష్మిని ఇంటి వద్ద పరామర్శించి పై సాయాన్ని ఆయన చేశారు. కాగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దుర్గాప్రసాద్ పిల్లలు చిన్నవాళ్లు కావడం, తండ్రి గతంలోనే మరణించడం, కుమారుడికి తల్లి తలకొరివి పెట్టిన ఘటన తనను ఎంతగానో కలచివేసిందని డీటీఓ అన్నారు. అలాగే ఏ ఇబ్బంది ఉన్నా కూడా తనను ఫోన్ ద్వారా సంప్రదించాలని కూడా ఆదిలక్ష్మిని ఆయన కోరారు.